క్లుప్తంగా

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంబాబునాయక్

అచ్చంపేట రూరల్: లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పదర మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మూడావత్ రాంబాబునాయక్‌ను నియమించారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబల్‌నాయక్ హైదరాబాద్‌లో నియామకపత్రం అందజేశారు.

ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 'యువతరం ఓట్లు–ప్రగతికి మెట్లు' అనే కార్యక్రమంలో భాగంగా గురువారం ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవ హారాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటుహక్కును నమోదు చేసుకోవాలని, ఓటింగ్ సమయంలో ఖచ్చితంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటరు అవగాహనపై స్వీప్ ద్వారా నిత్యం ఇలాంటి అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అనంతరం ఓటరు అవగాహనపై అధికారులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, కల్వకుర్తి ఎంఈఓ శంకర్ నాయక్, కళాశాల లెక్చలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి గురువారం నల్లగొండ జిల్లా డిండికి చెందిన కాసుల ఆచార్య, అమృతమ్మ జ్ఞాపకార్థకంగా కుమారుడు వెంకటాచారి, శోభారాణి దంపతులు రూ. 25,116లు ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామకృష్ణ, జంగయ్య, జూనియర్ అసిస్టెంట్లు అర్చకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక

దోమలపెంట: ఈగలపెంటలోని డీఏవీ ఆంగ్ల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ జయప్రసాద్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో డీఏవీ సీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడలో ఈగలపెంట డీఏవీ విద్యార్థులు హర్షియ సుల్తానా అండర్– 14 విభాగంలో లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం, అండర్– 17 విభాగంలో టి.అరుణ్ కుమార్ హైజంప్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఢిల్లీలోని ఘజియాబాద్‌లో డిసెంబర్ 2 వతేదీ నుంచి 4 వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి క్రీడల పోటీలల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా భూగర్భ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి విద్యార్థులను అభినందించారు. పీఈటీ జానయ్య పాల్గొన్నారు.

ఎన్నికల్లో సగరుల సత్తా చాటాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సగరుల సత్తా చాటాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులుసాగర్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా సగర సంఘం మండల కమిటీల నియామకానికి ఆయన పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ మండల అధ్యక్షుడిగా చిలుక పార్వతయ్య, బిజినేపల్లి మండల అధ్యక్షుడిగా రాజేష్, బిజినేపల్లి టౌన్ అధ్యక్షుడిగా రాకేష్‌లను ఎంపికయ్యారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు బాలు, నాయకులు సురంపల్లి సుధాకర్, కొమ్ముల వెంకటయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శనేశ్వరస్వామి వ్రతాలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ జేష్ట్యామాత సమేత శనేశ్వరస్వామి వ్రతాలు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు రెండు టెంకాయలు, పూలు పండ్లు, తెచ్చుకోవాలని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం సెల్: 9440231325, 8186821212 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దైవభక్తితో ప్రశాంతత

వెల్దండ: దైవభక్తితో ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నారాయణపూర్‌లో హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. చిన్న వెంకట్‌రెడ్డి, నర్సింహరెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనునాయక్, లక్ష్మీపతినాయక్, సురేష్, కృష్ణ, శేఖర్, శివ ఉన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా మహాత్మా జ్యోతిరావుపూలే 134వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు నివాళులర్పించారు.



తిమ్మాజిపేటలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, జిల్లా నాయకుడు నాగపూర్ మధు పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడు పూలే అని కొనియాడారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంఘం కార్యాలయంలో పూలే వర్ధంతిని నిర్వహించారు. సంఘం నాయకులు శివరాం, మల్లేష్, లక్ష్మయ్య, వెంకటయ్య, నవీన్, శేఖర్, కాళ్ల నిరంజన్, కుంభం మల్లేష్‌గౌడ్, అడ్వకేట్ శ్రీనివాసులు, నిరంజన్‌యాదవ్, పాల్గొన్నారు.

■ జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగిస్తామని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్‌లోని పూలే విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, నాయకులు ఉన్నారు.

■ బిజినేపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి తహసీల్దార్ శ్రీరాములు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాన కూడలిలో పూలే వర్ధంతిలో పలు పార్టీల నాయకులు హాజరయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

■ కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పూలే వర్ధంతి వేడుకల్లో బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షుడు రాజేందర్, మాజీ సర్పంచ్ ఆనంద్, ముఖ్య సలహాదారుడు మల్లయ్య, రమేష్‌చారి, గంగాధర్‌చారి, విజయ్‌గౌడ్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీను, మల్లేష్ హాజరయ్యారు.

■ వెల్దండ మండల కేంద్రంలో పూలే వర్ధంతితో వెల్దండ మండల ముదిరాజ్‌సంఘం అధ్యక్షులు మల్లేష్‌ముదిరాజ్ హాజరై మాట్లాడారు. పూలే జీవితం అందరికి ఆదర్శమన్నారు. నాయకులు కృష్ణముదిరాజ్, లింగంముదిరాజ్, వెంకటేష్‌ముదిరాజ్, నర్సింహ్మముదిరాజ్, శ్రీను, శేఖర్, మురళీ, శ్రీశైలం ముదిరాజ్, తదితరులు ఉన్నారు.

■ మన్ననూర్‌లో పూలే చిత్రపటానికి నాయకులు రహీం, శివాజీ, సైదులు పూలమాల వేసి నివాళులర్పించారు. కృష్ణయ్య, శివనారాయణ, వెంకటరమణ, సత్యనారాయణ, శంకరయ్య, వెంకటయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

■ పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే వర్ధంతిని నిర్వహించారు. హనుమంతు ప్రకాష్, తరుణ్, నాగేశ్వర్‌రావు, కురుమయ్య, రాజు, మంజునాథ్, చరన్, తదితరులు పాల్గొన్నారు.

■ తిమ్మాజిపేట మండల కేంద్రంలో పూలే విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. జోగు ప్రదీప్, వేణుగోపాల్ గౌడ్ స్వామి, యశ్వంత్, జోగు శేఖర్, కాళ్ల రాజు, సేన చిన్నయ్య, మల్లేష్, నరసింహ పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి



కల్వకుర్తిరూరల్: అర్హులైన లబ్ధిదారులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు వెంటనే ఇవ్వాలని కోరుతూ గురువారం అడిషనల్ కలెక్టర్ సీతారామారావుకు డబుల్ బెడ్‌రూం పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరాట సమితి అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ 240 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు జారీ చేసి 18 నెలలు అవుతున్నా ఇప్పటికి డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని వివరించారు. కార్యక్రమంలో నర్సింహ, శ్రీనివాసులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు నాటాలి



తాడూరు: నర్సరీలలో బ్యాక్ ఫిల్లింగ్ పూర్తి చేసి నాణ్యమైన విత్తనాలను నాటాలని డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్ సూచించారు. గురువారం మండల కేంద్రంతోపాటు గుంతకోడూరు, మేడిపూర్, ఆకునెల్లికుదురు గ్రామాల నర్సరీలలో మట్టిని నింపుతున్న బ్యాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిలో ఎర్రమట్టి, ఎరువు, గులికలు, గెమాక్సిన్‌పౌడర్ వంటి వాటిని తగిన మోతాదులో కలిపి బ్యాగ్‌లను నింపాలని సూచించారు. అనంతరం వరిధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించి వడ్ల నాణ్యత, పరికరం పనితీరును పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ చంద్రసిద్దార్థ, క్లస్టర్ పీఏ రాజేష్‌కుమార్, రాజు, సురేష్, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల మంగమ్మకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ. 60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు హైదరాబాదులో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, నాయకులు ఆంజనేయులు, అనిల్‌కుమార్, కొండల్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని స్వేరోస్ జిల్లా కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్వేరోస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. వనపర్తి జిల్లా, మదనాపురం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ప్రవీణ్ మరణం బాధాకరమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదికాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. బాధిత కుటుంబానికి రూ.60 లక్షల ఎక్స్‌గ్రేసియా, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మిద్దె ధర్మరాజు, సంపత్‌కుమార్, రామస్వామి, కాశన్న, శివశంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల పంపిణీ

కోడేరు: మండల కేంద్రానికి ఎనిమిది హైమాస్ట్ లైట్లు మంజూరు అయ్యారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం, ఉమామహేశ్వర దేవాలయం, చెన్నకేశవస్వామి దేవాలయం, మజీద్, కస్తూర్బాగాంధీ, గురుకుల, సాయిబాబ, దేవాలయాల వద్ద లైట్లు ఏర్పాటు కోసం హైమాస్ట్ లైట్లను ఆలయాల పూజారులకు పంపిణీ చేశారు. అబ్దుల్ ఖరీం, పాండేళ్ల సురేష్, చామంతి రాజు, రాజు, మిద్దె రామకృష్ణ, బాబు, పుట్ట రాము, తిరుపతి, పాండేళ్ల జగన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజను కొంటాం

వంగూరు: ప్రతి గింజను ప్రభుత్వం కొనేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ఉల్పరలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. సన్నవడ్లను రూ.500 బోనస్ కూడా ప్రభుత్వం ఇస్తుందన్నారు.అదేవిధంగా మండలంలోని మిట్టసదగోడు, ఉల్లంపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు భూమిపూజ చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీఓ విజయభాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పండిత్‌రావు, పాండురంగారెడ్డి, రమేష్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.



ఉల్పరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

లింగాల: మండలంలోని అవుసలికుంటలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం చైర్మన్ హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. మధ్య దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోద్దని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీఈఓ పాండు, రైతులు పాల్గొన్నారు.

సింహగర్జన సభతో మాలల ఐక్యతను చాటాలి



మాట్లాడుతున్న మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు కల్ములు బాలస్వామి

అమ్రాబాద్: డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జన భారీ బహిరంగ సభకు మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటాలని మాల మహానాడు అచ్చంపేట డివిజన్ అధ్యక్షులు కల్ముల బాలస్వామి పిలుపునిచ్చారు. గురువారం అమ్రాబాద్, పదర మండలాల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మల్లికార్జున్, అనిల్, పాండు, వెంకటనారాయణ, ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల..

కల్వకుర్తి టౌన్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించే మాలల సింహగర్జన వాల్‌పోస్టర్‌ను గురువారం పట్టణంలోని గచ్చుబావి వద్ద మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చెన్నయ్య, శ్రీనివాసులు, సుధాకర్, శేఖర్, రాంపర్వతాలు, రవి, రాంచందర్, బాలయ్య, స్వామినాథ్‌లె పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మన్ననూర్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఎఫ్ఓ రోహిత్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పీటీజీ పాఠశాల ఆవరణలో అపోలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొత్తం 14 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో మన్ననూర్ జట్టు, ద్వితీయ స్థానంలో అమ్రాబాద్ జట్టు నిలిచాయి. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ప్రతి జట్టుకు ప్రోత్సాహకంగా వాలీబాల్, నెట్ అందజేశారు. కార్యక్రమంలో జావీద్, ఓం ప్రకాష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ భవనాలను పూర్తి చేస్తాం



కోడేరు: మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ భవనాలను పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని ఈఈ మోహన్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ, గ్రామపంచాయతీ అసంపూర్తిగా ఉన్న భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పెండింగ్‌లో ఉన్న భవనాలను ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే పూర్తి చేసే విధంగా చూస్తామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కృషితో కస్తూర్బాగాంధీ, మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల హాస్టల్‌కు డార్మెటరీ ఒక్కొక్క భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేశారని వెంటనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం, చామంతిరాజు, సురేష్, రామకృష్ణ, మాజీ వార్డు సభ్యులు రాజు, జగదీశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం తనిఖీ

కోడేరు: మండలకేంద్రంతో పాటు జనుంపల్లి తదితర గ్రామాల్లో తహసీల్దార్ విజయ్‌కుమార్ వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని ఏపీఓ పార్వతమ్మకు సూచించారు. ఆర్ఐ సురేందర్, జమ్ములయ్య, పార్వతమ్మ పాల్గొన్నారు.

బెల్లం పట్టివేత: ముగ్గురిపై కేసు నమోదు

లింగాల: అక్రమంగా దిగుమతి చేసుకుంటున్న బెల్లం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య, ఎస్ఐ జనార్దన్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి లింగాలకు డీసీఎంలో బెల్లం తీసుకొస్తునట్లు అందుకున్న సమాచారం మేరకు నిఘా ఉంచి పట్టుకున్నట్లు వారు పేర్కొన్నారు. 18 కాటన్లలో 5.40 క్వింటాళ్ల బెల్లాన్ని గుర్తించి స్వాధీనం చేసుకునట్లు వివరించారు. లింగాలకు చెందిన నవీన్, చంద్రశేఖర్, మురళీపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఓ ఇంట్లో 2017వ సంవత్సరంలో లింగాల మండలంలోని కోమటికుంటకు చెందిన నాగశేషు చోరీకి పాల్పడ్డాడు. ఈ మేరకు అప్పటి ఎస్ఐ జలంధర్ రెడ్డి నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టి విచారణ నిర్వహించాడు. గురువారం కేసును పూర్తిగా విచారించిన జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కావ్య నిందితుడికి ఒక నెల జైలుశిక్షతో పాటుగా, రూ.వెయ్యి జరిమానాను విధించింది. పోలీసులను కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జునలు అభినందించారు.

సర్వేను త్వరగా పూర్తి చేయాలి

కోడేరు: సమగ్ర కుటుంబ సర్వేను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ బన్సీలాల్ ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్‌కు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డాటా ఎంట్రీని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, ఆర్ఐలు సురేందర్, జమ్ములయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రక్షణగా జిల్లా షీ టీం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల ఉన్నత పాఠశాలలో గురువారం షీ టీం సభ్యులు పోక్సో చట్టం గురించి అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎవరైన ఆకతాయిలు వేధిస్తే షీటీంకు తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు. టీ సేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. డయల్ 100 లేదా సెల్ 8712657676 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షీ టీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన మాక్ పోలింగ్ పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులే ఓటర్లుగా పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించారు. ఓటర్లు ఆధార్ కార్డుతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యార్థులు పోలీసులుగా వ్యవహరించి పోలింగ్‌ను సజావుగా జరిగే విధంగా సహకరించారు. ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండగా ప్రచారం కూడా పోటా పోటీగా నిర్వహించారు. ఓటింగ్ సరళిని కవరు చేయుటకు విద్యార్థులు ఎలక్ట్రానిక్ మీడియాగా పని చేశారు.

మాక్ పోలింగ్‌ను పరిశీలించిన అధికారులు..

ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్‌ను ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంఈఓ బషీర్ అహ్మద్, హెచ్‌ఎం కొండయ్య పరిశీలించి విద్యార్థులను అభినందించారు. పోలింగ్ కోసం విద్యార్థులను సన్నద్దం చేసిన ఉపాధ్యాయులను కొనియాడారు. పోలింగ్ ఏ విధంగా నిర్వహిస్తారో విద్యార్థుల అవగాహన కోసం మాక్ పోలింగ్‌ను ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం కొండయ్య తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని రామాలయంలో గురువారం కార్తీక త్రయోదశి పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ఆర్థికసాయం అందజేత



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వేముల కురుమయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన శెట్టి రాజేష్, విష్ణువర్ధన్‌రెడ్డిలు గురువారం రూ. 5000 ఆర్థికసాయం అందజేశారు. గ్రామస్తులు బంగారయ్య, చెన్నయ్య, చిట్టి బాబు, తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం ఎంపిక



ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో నూతనంగా మంజూరైన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు గురువారం ప్రధాన రోడ్డు పక్కన ఉన్న సర్వే నంబర్ 148లోని ప్రభుత్వ భూమిని ఎమ్మార్వై సుజాత, సర్వేయర్ ఎండీ షఫీ పరిశీలించారు. వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఎకరా పొలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనువుగా ఉన్నట్లు ఎంపిక చేశారు. సర్వే చేసి ఎంపిక చేసిన ప్రభుత్వ స్థలంపై తహసీల్దార్‌కు రిపోర్టు చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట గ్రామ పంచాయతీ కారోబార్ సుల్తాన్ ఉన్నారు.

పాఠశాలకు టేబుళ్ల వితరణ



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని దేశిటిక్యాల ఉన్నత పాఠశాలకు గురువారం మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి సమక్షంలో జూరెడ్డి జంగిరెడ్డి జ్ఞాపకార్థం జూరెడ్డి లక్ష్మారెడ్డి దంపతులు డ్యూయెల్ డెస్క్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల యాజమాన్యం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయోత్సవ కళా ప్రదర్శన

మన్ననూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావొస్తున్న సందర్భంగా విజయోత్సవాలలో భాగంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట ప్రభుత్వ సాంస్కృతిక కళాబృందం సభ్యులు కళా ప్రదర్శన నిర్వహించారు. ఆరు గ్యారంటీలలో ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, రూ: 500 లకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అమలవుతునట్లు ఆటపాటల ద్వారా వివరించారు. డిసెంబర్ 7వ తేదీ వరకు విజయోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. భాస్కర్, కృష్ణ, శివనాగులు, నరేందర్, శివయ్య, సికిందర్, పార్వతమ్మ, అస్మా, రేణుక, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పనులు పరిశీలన



కొల్లాపూర్: పట్టణ సమీపంలో 167వ జాతీయ రహదారి నిర్మాణ పనులను గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పరిశీలించారు. కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ చొరవతో జాతీయ రహదారి మంజూరైందని వివరించారు. ఆయన వెంట నాయకులు సందు రమేష్, శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, భరత్‌చంద్ర, మహేష్ తదితరులు ఉన్నారు.

కలుషిత ఆహారం వడ్డిస్తే చర్యలు

లింగాల: విద్యార్థులకు కలుషిత ఆహారం వడ్డిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంఈఓ బషీర్ అహ్మద్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం వారు సందర్శించారు. మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కూరగాయలు నాసికరంగా ఉండడం, నేలపై వాటిని ఉంచడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు, మూత్ర శాలలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొండయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ మంగమ్మ పాల్గొన్నారు.

బల్మూర్: స్థానిక బీసీ బాలిక వసతి గృహాన్ని ఎంపీడీఓ రాఘవులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని విద్యార్థులకు అందించే భోజన సామగ్రి నాణ్యత, బియ్యంతో పాటు పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ఆయన విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం అందిస్తున్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మధ్యాహ్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చొక్కన్నపల్లి, భర్కత్‌పల్లి, చెర్కూర్ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. జీహెచ్‌హెం రవీందర్, కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవంతి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల శ్రీధర్ ఉన్నారు.



బల్మూర్‌లో వసతిగృహంలో వంట సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అమ్రాబాద్: మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అమ్రాబాద్ ఎంపీడీఓ వెంకటయ్య సూచించారు. మండలంలోని జంగంరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. హాస్టల్లో విద్యార్థుల హాజరు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని కూరగాయలు, బియ్యం, నూనెలను తనిఖీ చేశారు. హెచ్‌ఎం రాజేశ్వరి, పాల్గొన్నారు.